ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024 | 5



కిటకిటలాడిన వాడపల్లి క్షేత్రం


అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2.88 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు. అలాగే స్వామివారి గోశాలకు అంతర్వేదికి చెందిన గుండుబోగుల సత్యనారాయణ 50 కేజీలు, నరసింహమూర్తి 25 కేజీలు, నాగేశ్వరరావు 25 కేజీలు దాణాను అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నప్రసాద శాలలో వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆర్జిత సేవలు రద్దు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 29 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న దృష్ట్యా వివిధ ఆర్జిత సేవలు నిలుపుదల చేస్తున్నట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఐశ్వర్యలక్ష్మి హోమం సేవలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీ బుధవారం నుంచి యథావిధిగా సేవలు కొనసాగుతాయన్నారు.

రారండోయ్.. వాడపల్లి వైభవం చూసేందుకు..

నేటి నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఏర్పాట్లపై ప్రత్యేక కథనం 6లో


విద్యుత్ దీపాలంకరణలో ధగధగ మెరిసిపోతున్న వాడపల్లి పుణ్యక్షేత్రం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమలాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించడానికి జిల్లా బిక్ష్షారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. అమలాపురంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొననున్నట్లు ఎస్పీ కార్యాలయం తెలిపింది.

రేపటి నుంచి క్రికెట్ జట్ల ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి అడబాల విజయశ్రీనివాస్, పీడీ తోట రవి తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో జీఎంసీ బాలయోగి స్టేడియంలో జట్ల ఎంపిక జరుగుతుంది. 22న అండర్-14 బాలురు, అండర్-17 బాలికల జట్లను 23న అండర్-17 బాలుర జట్లను ఎంపిక చేస్తామన్నారు.

నేడు గ్రీవెన్స్ యథాతథం

అమలాపురం టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ గ్రీవెన్స్ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్, మండల స్థాయిలో కూడా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గుండెల మీద కుంపటి


అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద ఫ్లెయిర్ ఫిట్‌పై గ్యాస్ మంటలు(ఫైల్)

కృష్ణ గోదావరి బేసిన్ పరిధిలో ఓఎన్జీసీ టెర్మినల్స్ వద్ద ఫ్లెయిర్ ఫిట్‌లపై నిరంతరంగా గాలిలో గ్యాస్ మండించడం, చమురు సహజ వాయివుల అన్వేషణకు చేపట్టే స్సిసిక్ సర్వేల వల్ల సముద్ర జలాల్లో చమురు సంస్థల కార్యకలపాల వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. గడిచిన నలభై ఏళ్లుగా కోనసీమ గుండెలపై కుంపటిలా ఓఎన్జీసీ కార్యకలాపాలు సాగుతున్న అభివృద్ధి మాత్రం అంతంతమాత్రమే.

పర్యావరణానికి ముప్పు

గడిచిన నాలుగు దశాబ్దాలలో లక్షలాది కోట్ల క్యూబిక్ మీటర్ల మేర ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు ముడిచమురు సహజ వాయివులను తరలించుకుపోతున్న ఓఎన్జీసీ కార్యకలాపాలు సాగించే టెర్మినల్స్ ఉన్న ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బెల్ట్ ద్వారా పచ్చనిచెట్లు పెంచకపోవడంతో పర్యావరణం దెబ్బతింది. పచ్చని భూములకు సైతం నష్టం వాటిల్లుతోంది. చమురు సహజ వాయివులు నిక్షేపాలపై స్సిసిక్ సర్వేలతో పాటు భూఉపరితలం, సముద్ర జలాల్లో చమురు నిక్షేపాలను భారీగా తీసేయడంతో క్రమేపీ భూమి కుంగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. కోనసీమలోని ఓడలరేవు, బోడసకుర్రు, నగరం, ఎస్.యానాం తదితర ప్రాంతాల్లో టెర్మినల్స్ వద్ద నిరంతరాయంగా ఫ్లెయిర్‌ఫిట్‌లపై గ్యాస్ మంటల వల్ల పర్యావరణం కలుషితమై కొబ్బరి సరుగుడు తోటలకు నష్టం వాటిల్లి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. సముద్ర జలాల్లో ఓఎన్జీసీ ప్రైవేటు సంస్థల చమురు ఉత్పత్తుల కార్యకలాపాల వల్ల ప్లాట్‌ఫారాలు, డ్రిల్లింగ్ రిగ్గుల నుంచి చమురు లీకేజీలతో పాటు రసాయన వ్యర్థాలు కలిసిపోయి సముద్ర జలాల్లో చేపల ఉత్పత్తులు తగ్గిపోయాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

● అల్లవరం(ఆంధ్రజ్యోతి)

ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్యాస్ మంటలతో కోనసీమ పర్యావరణానికి ముప్పు

గ్రీన్ బెల్ట్ పరిరక్షణను పట్టించుకోని చమురు సంస్థలు

చమురు, గ్యాస్ వెలికితీతతో కుంగిపోతున్న భూమి

భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలకు కారణం కావచ్చంటున్న నిపుణులు

అడుగడుగునా నిర్లక్ష్యమే..



టెర్మినల్స్ బావుల వద్ద రసాయనలతో కూడిన వ్యర్థ జలాలు డ్రైవెల్స్‌లలో నింపాల్సి ఉంది. ఒక్కోసారి ట్యాంకర్ల ద్వారా తోటల సమీపంలో వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సముద్ర తీరంలో టెర్మినల్స్ స్థలాలు నింపడానికి తీరంలో వందల కొద్దీ లారీల ఇసుకను తవ్వేయడంతో తీర ప్రాంత రక్షణ కరువైంది. ఇటీవల ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ ప్రాంతంలోకి తుఫాన్‌కు సముద్రపు అలలు చొచ్చుకురావడం ఓఎన్జీసీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెబుతున్నారు. 1995లో బోడసకుర్రు వద్ద భారీ విస్ఫోటంతో గ్యాస్ బ్లోఅవుట్ తీవ్ర నష్టం కలిగించింది. నగరం విస్ఫోటంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. తాండవపల్లి, దేవరపల్లి, బ్లోఅవుట్‌లు, తాడికోన డ్రిల్ సైటులో భారీ గ్యాస్ లీకేజీ పర్యావరణానికి మాయనిమచ్చగా మిగిల్చాయని అంటున్నారు. ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ బావుల ద్వారా ఓఎన్జీసీ గెయిల్ సంస్థలు కాలం చెల్లిన పైపులైన్ నుంచి ముడి చమురు సహజ వాయివుల సరఫరాలో తరచూ గ్యాస్ లీకేజీలో బెంబేలెత్తిస్తున్నాయి. చమురు, సహజ వాయివులు ఉత్పత్తుల వల్ల జల, శబ్ద, వాయి కాలుష్యాలతో కోనసీమ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ ప్రాంతం భూకంపాల బారిన పడకుండా డ్రైవెల్స్‌లో నీరు నింపాలని (వాటర్ ఇంజెకిటింగ్) కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు కోనసీమ ప్రాంతంలో చర్యలతో పాటు సముద్ర తీర ప్రాంతం కోత బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టేందుకు కేంద్ర పెట్రోలియం శాఖపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు పూర్తిస్థాయిలో వినియోగించి కోనసీమను అభివృద్ధి పథంలో నడిపించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

కొత్త కార్డులు వస్తున్నాయ్..

మారనున్న రేషన్‌కార్డుల రూపురేఖలు

జగన్, రాజశేఖర్‌రెడ్డి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కార్డులు

అమలాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెల్లకార్డులు త్వరలో రూపుమారనున్నాయి. జగన్, రాజశేఖర్ రెడ్డి ఫొటోల స్థానంలో రాజముద్రతో ఉన్న కొత్త కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా కార్డుల వివరాలు సేకరించింది. గతంలో తెల్లరేషన్ కార్డులపై రాజముద్రతో పాటు కుటుంబ సభ్యుల ఫొటోలు ఉండేవి. అప్పటి సీఎం జగన్ ప్రచార ఆర్భాటం కారణంగా వైసీపీ హయాంలో ప్రభుత్వం జారీచేసే అన్ని పత్రాలపైనా తన ఫొటో వేసుకున్నారు. దీనికనుగుణంగానే గత ఐదేళ్లలో రేషన్ కార్డులతో పాటు జనన, మరణ, రిజిస్ట్రేషన్, పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాలు, కుల ధ్రువీకరణ ఇలా ప్రతీ పత్రంపై జగన్ ఫొటోలు దర్శనమిచ్చేవి. కూటమి ప్రభుత్వం ఈ ఆర్భాటాలకు దూరంగా ఉంది. జగన్, వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోలతో జారీచేసిన తెల్లకార్డులను పూర్తిగా తొలగించి కొత్తవాటిని లబ్ధిదారులకు అందించాలని యోచించింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కార్డులను మార్చాల్సి ఉండటం, పెద్ద ఖర్చుతో కూడిన పని కావడంతో మొదట్లో తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ప్రస్తుతం 100 రోజుల పాలన పూర్తికావడంతో ఇటువంటి ఫొటోలతో జారీచేసిన కార్డులను తొలగించి వాటి స్థానంలో రాజముద్రతో కూడిన కార్డులను జారీ చేయాలని నిర్ణయించింది. త్వరలో పాతకార్డులను పూర్తిగా తొలగించి వాటిస్థానంలో కొత్త కార్డులను అందించనున్నారు. ఈ ప్రక్రియ ఈ ఏడాది చివరి నాటికి దాదాపు పూర్తయ్యే అవకాశం ఉందని సివిల్ సప్లైస్ వర్గాలు చెబుతున్నాయి.

ఉభయగోదావరి జిల్లాల

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్

టీడీపీ అధిష్ఠానం ప్రకటన



అమలాపురం- ఆంధ్రజ్యోతి: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సీనియర్ టీడీపీ నాయకులు పేరాబత్తుల రాజశేఖర్ పేరును ఖరారు చేస్తూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన రాజశేఖర్ గత కొన్నేళ్ల నుంచి టీడీపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతంలో కాకినాడ రూరల్ అసెంబ్లీ స్థానం కోసం ప్రయత్నించారు. చివరికి జనసేనకు కేటాయించడంతో భంగపడ్డారు. అప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌గా వ్యవహరస్తూ ఈ ప్రాంతంలో చంద్రబాబు పర్యటనలకు ఏర్పాట్లు చేయడంలో విజయవంతమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు రాజశేఖర్‌కు ఏదో పదవి ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రాజశేఖర్ పేరును ఖరారు చేస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం ప్రకటించింది. అయితే కోనసీమ జిల్లాలో ఇప్పటికే ఆ స్థానం కోసం మాజీ మంత్రి మెట్ల తనయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు పేరును పరిశీలించాల్సిందిగా కోనసీమ జిల్లాకు చెందిన టీడీపీ నాయకత్వం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అభ్యర్థించింది. ఎంపీ, ఎమ్మెల్యేలు చంద్రబాబును కలిసి రమణబాబుకు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని కోరారు. పార్టీ అధిష్ఠానం కూడా రమణబాబుతో పాటు మరికొందరి పేర్లతో ఇటీవల ఐవీఆర్ఎస్ సర్వే కూడా చేపట్టింది. ఈ నేపథ్యంలో పేరాబత్తుల రాజశేఖర్ అభ్యర్థితత్వం వైపు టీడీపీ అధిష్ఠానం మొగ్గు చూపి ఆయన పేరును ఖరారు చేసింది. దాంతో కోనసీమతో పాటు గోదావరి జిల్లాల్లో రాజకీయ వాతావరణ వేడెక్కింది. రాజశేఖర్ ఇప్పటికే తన వంతు ప్రయత్నంగా పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు. సీఎం చంద్రబాబుకు సన్నిహితంగా ఉండటంతో పాటు వివిధ జిల్లాలోని టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. దీంతో రాజశేఖర్ విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలంతా ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం ప్రకటనతో ముమ్మిడివరం నియోజకవర్గంలోని ఐ.పోలవరం మండలంలో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు.


ప్రథమ స్థానంలో నిలిచిన కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థులు


ద్వితీయ స్థానంలో కాకినాడ పీఆర్ కళాశాల


తృతీయ స్థానంలో నిలిచిన మండపేట కళాశాల విద్యార్థులు

ముగిసిన ‘నన్నయ’ కళాశాలల కబడ్డీ పోటీలు

● మొత్తం 16 కళాశాలల క్రీడాకారుల మధ్య పోటీ ● సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు పలువురి ఎంపిక

మండపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు పాటు జరిగిన అదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో గల డిగ్రీ కళాశాల విద్యార్థుల కబడ్డీ పోటీలు ముగిశాయి. మొత్తం 16 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాన్ని కాకినాడ ఐడియల్ కళాశాలకు చెందిన క్రీడాకారులు, ద్వితీయ స్థానాన్ని కాకినాడ పీఆర్ కళాశాల విద్యార్థులు, తృతీయ స్థానాన్ని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.టి.టి.వి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఎంపికైన 16 మంది క్రీడాకారులు ఈనెల 30న చెన్నయ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఎంపిక చేశామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. రెండు రోజులు పాటు మండపేటలో నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా క్రీడాకారులు పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండపేటలో జరుగుతున్న క్రీడా పోటీలతో పూర్వ వైభవం తిరిగి వచ్చిందని క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజేతలైన జట్లకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కళాశాల అధ్యాపకులు ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. విజేతలైన క్రీడాకారులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఆనంద్, పీడీ వీరాంజనేయులు, అధ్యాపకులు దిలీప్, రాజేష్ పాల్గొన్నారు.



‘ఈవీ’ధంగా పరుగులు

ఈ-బైక్‌లు, ఈ-కార్లు, ఈ-ఆటోలపై పెరుగుతున్న ఆసక్తి


ప్రత్యేక కథనం 6లో..



ప్రకృతి రమణీయత

మండపేట పట్టణ శివారు పొలాల్లో చూడముచ్చటగా కనిపించిన దృశ్యం

● మండపేట, (ఆంధ్రజ్యోతి)



'ఈవీ'ధంగా పరుగులు!

నగరాల్లో ఎటుచూసినా కాలుష్యం. కంటికి కనిపించకుండానే గాలిలో కలిసి హానికరంగా మారుతోంది. వాహనాల నుంచి వచ్చే పొగ కారణంగా పర్యావరణం దెబ్బతింటోంది. గాలిలో తగ్గుతున్న నాణ్యతే దీనికి నిదర్శనం. దేశంలో చాలా నగరాల్లో ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) సంఖ్య 100 దాటుతోంది. ఇది ఆందోళన కలిగించే అంశమే. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లోను ఈ సంఖ్య ఒక్కోసారి 100 దాటుతోంది. ఈ సమస్య పరిష్కారానికే కేంద్రం ఎలక్ట్రికల్ వాహనాలపై దృష్టి పెట్టింది. దీంతో నెమ్మదిగా వీటి అమ్మకాలు జోరందుకుంటున్నాయి. పెట్రోలు వాహనాలతో పోలిస్తే ఖర్చు తక్కువ. పర్యావరణహితం కూడా. ఇప్పుడిప్పుడే సామాన్యులు సైతం 'ఈవీ'ధంగా అడుగులు వేస్తున్నారు. దీంతో ఈ-బైక్‌లు, ఈ-కార్లు, ఈ-ఆటోలు రోడ్ల మీద సందడి చేస్తున్నాయి.

ఈవీ వాహనాల వాడకం పెరుగుతోంది..

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్ అయిన ఈ వాహనాలు

ఆర్టీవో పరిధి	ఎలక్ట్రిక్ (బీవోవీ)	ప్యూర్ ఈవీ	స్ట్రాంగ్ హైబ్రిడ్‌ఈవీ
రాజమహేంద్రవరం	1015	380	23
కాకినాడ	1295	373	22
అమలాపురం	217	76	5
మండపేట	201	47	4
కత్తిపూడి	165	37	3
రంపచోడవరం	31	5	0



- రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో భారీగా వాహన కాలుష్యం
- గాలిలో తగ్గుతున్న నాణ్యత.. 100 దాటుతున్న ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- వాహనాల కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాలే పరిష్కారం
- నగరాల్లో ఇప్పుడిప్పుడే పెరుగుతున్న ఈవీల సంఖ్య
- ఈ-బైక్‌లు, ఈ-కార్లు, ఈ-ఆటోలపై పెరుగుతున్న ఆసక్తి
- ఈ-బస్సులపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి.. ఇప్పటికే ప్రతిపాదనలు
- కాలుష్యరహితం.. పర్యావరణహితం.. ఖర్చు మితం..



తగ్గుతున్న గాలి నాణ్యత..



పొల్యూషన్ బోర్డు ప్రతి వారం నిర్వహించే పరీక్షల్లో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో గాలిలో నాణ్యత తగ్గుతోందని తేలింది. గాలిలో నాణ్యతను గుర్తించే ప్రక్రియను ఎయిర్ క్వాలిటీ ఇండక్స్(ఏక్యూఐ) అంటారు. గాలిలో ఉండే పీఎంలు(పర్టిక్యులర్ మేటర్), నైట్రోజన్ డయాక్సైడ్(ఎన్‌వో2), ఓజోన్(ఓ3), సల్ఫర్ డయాక్సైడ్(ఎస్‌వో2), కార్బన్ మోనోక్సైడ్ (సీవో)లను బట్టి ఈ ఏక్యూఐను నిర్ధారిస్తారు. వీటిలో పీఎంలు వాతావరణంలో కలిసిపోయి చిన్న కణాలుగా ఉంటాయి. మిగిలినవి వాయురూపంలోనే ఉంటాయి. ఈ ప్రమాదకర వాయువులన్నీ పరిశ్రమలు, వాహనాల కాలుష్యంనుంచే విడుదలవుతాయి. ఈ ఏక్యూఐ ఎక్కువగా ఉంటే గాలిలో నాణ్యత తగ్గుతున్నట్టు లెక్క. 50లోపు ఉంటేనే శ్రేయస్కరం. 100లోపు ఉంటే అంతంతమాత్రం. 100 దాటితే ఆందోళనకరం.

(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)/ కార్పొరేషన్(కాకినాడ), ఆంధ్రజ్యోతి:

కాకినాడ జిల్లా పరిధిలో 20లక్షల92వేలమంది జనాభా ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 18లక్షల33వేలమంది జనాభా ఉన్నారు. వీటిలో కాకినాడ,రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లుగా ఉన్నాయి. ఆస్పత్రులు, కళాశాలలు, పెద్దపెద్ద సంస్థలు వంటివన్నీ ఈ నగరాల్లోనే నెలకొల్పారు. దీంతో పరిసర ప్రాంతాల్లోని చాలామంది ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, చదువుల నిమిత్తం నగరాల్లోనే స్థిరపడుతున్నారు. దీనివల్ల ఇక్కడ జనాభా తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు నగరాల్లో వాహనాల సంఖ్య భారీగా ఉంది. వాటి నుంచి వెలువడే కాలుష్యం ఈ నగరాలపై ప్రభావం చూపిస్తోంది. దీని నియంత్రణకు గాను మొక్కలు విరివిగా పెంచాల్సి ఉంది. నగరమంతా పచ్చదనం కనిపించాలి. తద్వారా ప్రజలకు స్వచ్ఛమైన గాలి పీల్చే అవకాశం ఉంటుంది. కానీ, కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో మొక్కల పెంపకం ఉన్నప్పటికీ ఆశించినస్థాయిలో లేదు. దీనివల్ల కాలుష్యం పెరిగినప్పుడల్లా గాలిలో నాణ్యత తగ్గుతోంది. ఈ గాలి పీల్చడం ద్వారా ప్రజలకు పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ నేపథ్యంలో వాహనాల నుంచి వెలువడే కార్బన ఉద్గారాల సమస్యను పరిష్కరించేందుకు ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను పెంచాలన్న వాదన ఉంది. ఇందులో భాగంగా మొదటి అడుగుగా నగరపాలక సంస్థల పరిధిలో చెత్తసేకరణకు ఈ-రిక్షాలు, ఈ-కార్ట్ వాహనాలనే వినియోగిస్తున్నారు. ప్రజల్లోను ఈవీల వినియోగంపై ఆసక్తి కలుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఈ-బైక్‌లు, ఈ-కార్లు

ఉమ్మడి తూర్పుగోదావరిలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంల్లో ఈ-బైక్‌లు విక్రయించే షోరూంలు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. మూడు జిల్లాల్లో నెలకు కనీసం 50 వరకూ ఇవి రోడ్డెక్కుతున్నాయి. ఈ-బైక్‌లు రూ.50వేలు మొదలుకొని రూ.2లక్షల వరకూ వివిధ శ్రేణుల్లో అందుబాటులో ఉన్నాయి. ఇక ఈవీ కార్లను ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు ఇప్పటికే మార్కెట్‌లోకి దింపాయి. వీటి ధరలు భారీగానే ఉంటున్నాయి. దీంతో సంపన్న వర్గాలు మాత్రమే వీటిపై దృష్టిపెట్టాయి.



ఆర్టీసీలో 150 ఈవీలకు ప్రతిపాదనలు

కాకినాడ, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోల్లో కూడా ఎలక్ట్రికల్ బస్సులకు ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి. కాకినాడ జిల్లాలో ఆర్టీసీకి ప్రస్తుతం 25 బీఎస్6 బస్సులు వచ్చాయి. వీటిలో 21 బస్సులు సూపర్‌లగ్జరీ, 4 బస్సులు స్లీపర్ కోచ్‌లు ఉన్నాయి. ఇవీ పర్యావరణహితంగా ఉంటాయని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా కాకినాడ ఆర్టీసీ డిపోకి 50, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోకి 100 చొప్పున ఈవీ బస్సులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇవి ఒక్కో బస్సు రూ.1.50 కోట్లకు కలిపి మొత్తం రూ.225కోట్లతో కొనుగోలుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. వీటిని ఉమ్మడి జిల్లా పరిధిలో తిప్పేలా ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు వీటి నిమిత్తం మొత్తం 25చోట్ల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో హైదరాబాద్, విజయవాడ నుంచి రాజమహేంద్రవరం మీదుగా కొన్ని ఎలక్ట్రికల్ బస్సులు తిరుగుతున్నాయి.



మన నగరాల్లో ఏక్యూఐ

ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గాలిలో నాణ్యత ఆయా సమయాలను బట్టి మారుతోంది. ఆదివారం, ఇతర సెలవురోజుల్లో వాహనాల ప్రయాణం తక్కువగా ఉంటుంది కాబట్టి అప్పుడు సాధారణ స్థితి ఉంటోంది. ఇతర రోజుల్లో ఎక్కువగా ఉంటోంది. దీనివల్ల గాలిలో నాణ్యత తగ్గి ఒక్కోసారి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా నిర్వహించిన ఏక్యూఐ పరీక్షల్లో కాకినాడలో ఓ సందర్భంలో అత్యధికంగా 108 ఉందని తేలింది. రాజమహేంద్రవరంలో కూడా ఓ సందర్భంలో అత్యధికంగా 115 వరకూ ఉందని నిర్ధారణైంది. ఇది ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. రెండుచోట్ల ఆదివారం 50 లోపే ఉంది.

● కంటికి కనిపించని శత్రువు

స్విట్జర్లాండ్‌కి చెందిన ఓ సంస్థ అధ్యయనంలో అత్యంత కాలుష్యభరిత దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో మన దేశంతో సహా చాలా దేశాలు ఎకో ఫ్రెండ్లీ విధానాలను అనుసరిస్తున్నాయి. దీనిలోభాగంగా వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. వాయుకాలుష్యానికి ఏటా ప్రపంచవ్యాప్తంగా 80లక్షల మంది ప్రాణాలు పోతున్నాయి. పెట్రోవాహనాలు, ఫ్యాక్టరీలు విడుదల చేసే పొగలోని సూక్ష్మధూళి, రసాయన కణాలు,కర్బన ఉద్గారాలు ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెపోటుకు కారణమవుతూ ప్రాణాలను కబళిస్తున్నాయి. పిల్లల్లో శ్వాస, నాడీ వ్యవస్థలను వాయు కాలుష్యం నాశనం చేస్తోంది. పిల్లల్లో న్యూమోనియా కేసుల సంఖ్య పెరగడం శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పటికే పెట్రో వాహనాల కొనుగోళ్లపై హిమాచల్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈనిర్ణయం ఈవీల కొనుగోలుకు ఊతంగా మారి గ్రీన్ అండ్ క్లీన్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని భావిస్తున్నారు.



● నగరాల్లో ఈ-ఆటోల పరుగులు

ఎలక్ట్రికల్ విప్లవం మొదలు కావడంతో ఈవీ ఆటోలు కూడామార్కెట్‌లోకి వచ్చేశాయి.నాణ్యతను బట్టి రూ.1.5 లక్షల నుంచి రూ.4లక్షల వరకు వివిధ ధరల్లో అందుబాటులో ఉంటున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాలతోపాటు అమలాపురం, రావులపాలెం, మండపేట, సామర్లకోట, పిఠాపురం, తుని, కొవ్వూరు పట్టణాల్లోను ఈ-ఆటోలు పరుగులు పెడుతున్నాయి. వీటి మోడళ్లు కూడా కాస్త భిన్నంగా ఉండడంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో చార్జింగ్ స్టేషన్లు

ఈవీలకు చార్జింగ్ స్టేషన్లు పెరగాల్సి ఉంది. ప్రస్తుతం వినియోగదారులు ఈ-బైక్‌లు, ఈ-ఆటోలకు ఇళ్ల వద్దే చార్జింగ్ పెట్టుకుంటున్నారు. వీటికి కనీసం నాలుగైదు గంటలపైనే సమయం పడుతోంది. ఎథర్, టాటా, రెన్ వంటి మోటారు కంపెనీలు తమ సర్వీస్ సెంటర్ల వద్ద చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాయి. వీటివద్ద బైక్‌లు, ఆటోలు, కార్లకు చార్జింగ్ పెట్టుకునే వీలు కలుగుతోంది. ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరంల్లో మాత్రమే ఇవి అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో తుని నుంచి రాజమహేంద్రవరం మధ్య నాలుగైదు చోట్ల పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. రాజానగరం దగ్గర్లో రెండు, గండేపల్లి మండలం మురారిలో ఒకటి, జగ్గంపేట మండలం జెడ్.రాగంపేటలో ఒకటి, తుని మండలం తేటగుంటలో ఒకటి ఉన్నాయి. హైవేపై ప్రయాణించే ఈవీ కార్లు, బస్సులకు ఈ స్టేషన్లవద్ద చార్జింగ్ పెడుతున్నారు.



రాజానగరం సమీపంలో ఈవీ చార్జింగ్ స్టేషన్

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం

- నేటి నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- ఘనంగా ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

● ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి):



కోనసీమ తిరుమల శ్రీదేవి భూదేవి సమేత వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ చవితి సోమవారం నుంచి 29 మంగళవారం వరకు తొమ్మిది రోజుల పాటు తిరుమల తరహాలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎప్పుడూ లేని విధంగా ప్రచార మాధ్యమాల ద్వారా భక్తులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనకాపల్లి నుంచి విజయవాడ వరకు జాతీయ రహదారుల వద్ద బ్రహ్మోత్సవ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతంలో ఎల్‌ఈడీతో డిజిటల్ ప్రచారం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే హోమాలకు యాగశాలను కూడా సిద్ధం చేశారు. వసంత మండపం ప్రాకార మండపాలలో బెంగళూరు పుష్పాలతో అలంకరించే పనిలో ప్రత్యేక నిపుణులు నిమగ్నమయ్యారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవర ప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. రావులపాలెం నుంచి బొబ్బర్లంక వాడపల్లి, లొల్ల ప్రాంతాలలో ముఖ ద్వారాలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.



యాగశాల



ప్రాకారాలంకరణ



పుష్పాలంకరణ



ప్రత్యేక ఏర్పాట్లు చేశాం..

ఉప కమిషనరు సూర్యచక్రధరరావు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి నెల రోజుల క్రితమే ఉపకమినరుగా బాధ్యతలు స్వీకరించా.. వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాం. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నాం. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు స్వామివారి ప్రసాదాలు భక్తులకు అందించనున్నాం. స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేపడుతున్నాం.

నేడు శేషవాహన సేవ

సోమవారం ఉదయం 9.30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అకల్మష హోమం, సాయంత్రం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. రాత్రి 7.30 గంటలకు పరావాసుదేవ అలంకరణతో శేషవాహనంపై శ్రీవారు తిరు వీధులలో విహరించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

తొమ్మిది రోజుల పాటు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు అందించనున్నారు. కేరళ విలక్ డ్యాన్స్, గురవై వేషాలు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారణాసి డ్యాన్సు, మహారాష్ట్ర వాయిద్యం, కరీంనగర్ తీన్‌మార్, తిరుపతి సేక్సోఫోన్, కేరళవాయిద్యం, డోలు సన్నాయి, భరతనాట్యం తదితర వాటిని ప్రదర్శించనున్నారు.

ఐపీఎల్ తరహాలో గోదావరి క్రికెట్ ప్రీమియర్ లీగ్



ప్రీమియర్ లీగ్ క్రికెట్ లోగో ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

- డిసెంబరు 1 నుంచి 12 వరకు కాకినాడలో నిర్వహణకు ఏర్పాట్లు

కాకినాడఅర్బన్, అక్టోబరు 20: కాకినాడలో మొదటిసారిగా ఐపీఎల్ తరహాలో జీపీఎల్ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండడం అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. డిసెంబరు 1 నుంచి 12 వరకు గోదావరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ కాకినాడలో నిర్వహిస్తారన్నారు. ఆదివారం ఆయన నివాసంవద్ద టోర్నమెంట్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12రోజులపాటు జరిగే ఈ టోర్నమెంటులో ఆరు జట్లుగా ఏర్పాటుచేసి పోటీలు పెడతారన్నారు. మిరాకిల్ ఇంజనీరింగ్ సౌజన్యంతో ఏర్పాట్లు చేస్తారన్నారు. అమ్ప్రైప్లై స్పోర్ట్స్ ముఖ్య కార్యదర్శి ఎస్.కరుణాకర్ మాట్లాడుతూ డేవిడ్ కాకినాడ కింగ్స్, చిట్ల కిరణ్ పిఠాపురం పాంథర్స్, హరీష్ కోనసీమ లయన్స్‌లోవస్ రామచంద్రపురం రాయల్స్, జీవీ కే తుని డస్కస్, షణ్ముఖ గోదావరి రైడర్స్ జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తామన్నారు. టోర్నమెంట్‌కు వైస్‌ఛైర్మన్‌గా చిట్టూరి డేవిడ్ వ్యవహరిస్తారన్నారు. ఆటగాళ్లకు వేలం నిర్వహించి 20-20తరహాలో పోటీలకు శ్రీకారం చుట్టారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

కాకినాడఅర్బన్, అక్టోబరు 20: మూడురోజులుగా కాకినాడలో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లాల స్కేటింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-11, 14, 17, 19 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సీఈవో బి.శ్రీనివాసకుమార్, హరీష్ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్, పరిశీలకులు ఎస్.దిలీప్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి కె.నూకరాజు, స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, దొరైస్వామి, జి.సునీల్‌కుమార్, పరుశరామ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికలు

నవంబరు రెండోవారంలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఎంపికైన క్రీడాకారుల వివరాలివి. అండర్-11 విభాగంలో బాలికల్లో.. విశాఖకు చెందిన దూసర్లపూడి ప్రియానందశ్రీవర్షిణి, షాయిఖ్ దిల్‌సద్ అమీనా, చాంతాటి చార్వి ఉన్నారు. బాలురలో.. తూర్పుగోదావరికి చెందిన ఎస్.శ్యామ్‌సుందర్‌రెడ్డి, అనంతపురానికి చెందిన ఆర్.సాయి కార్తీక్‌రెడ్డి, చిత్తూరుకు చెందిన సి.జతిన్‌రెడ్డి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో తూర్పుగోదావరికి చెందిన కె.భవ్యశ్రీ, చిత్తూరుకు చెందిన కామిశెట్టి ఖ్యాతి, కృష్ణాజిల్లాకు చెందిన సాన్వి రఫియా, బాలురలో తూర్పుగోదావరికి చెందిన ఎమహీధర్ రాజకుమార్, ఆర్.శ్రీఅఖిల్‌రిషివర్మ, కృష్ణాజిల్లాకు చెందిన బలరాం ఉన్నారు. అండర్-17 బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన మహమ్మద్ హనీఫ్‌మోహన్, విశాఖకు చెందిన పెరవలి శ్రీకీర్తి, నెల్లూరుకు చెందిన పి.యశశ్విని, బాలురలో చిత్తూరుకు చెందిన షాయిక్ అమీర్, కృష్ణాజిల్లాకు చెందిన పి.యోషిత్ రెడ్డి, మధులీలావెంకట సుధీర్ ఎంపికయ్యారు.

క్వాడ్ విభాగంలో అండర్-11 బాలబాలికల్లో గుంటూరుకు చెందిన తన్మయినాగదుర్గ, నెల్లూరుకు చెందిన సీహెచ్.నాగజ్యోత్స్న, తూర్పుగోదావరికి చెందిన మోసా హనీసుసాన్, విరోధి రిషీశ్వర్, విశాఖకు చెందిన కరణం జైచందన్, గుంటూరుకు చెందిన వై.జినేష్‌సాయి ఉన్నారు. అండర్-14లో నెల్లూరుకు చెందిన నందిని, ఆద్విరమ్య, కృష్ణాజిల్లాకు చెందిన తనూజసాయి, తూర్పుగోదావరికి చెందిన నిఖిల్ ఈశ్వర్, చందు శ్రీధర్, కృష్ణాజిల్లాకు చెందిన ఫర్దీస్ ఉన్నారు.

అండర్-17 క్వాడ్ విభాగం.. బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన వీవీ వీరవర్షిని, విశాఖకు చెందిన విద్యా ప్రజాపతి, నెల్లూరుకు చెందిన ఎస్.జెస్మిత, బాలురలో విశాఖకు చెందిన పూటిపల్లి జాన్సన్, అంబుజి లోహిత్‌సాయి, బుడ్డిగ శశాంక్ ఎంపికయ్యారు. అండర్-19లో చిత్తూరుకు చెందిన కె.స్నేహకృతి, కృష్ణాకు చెందిన జయశ్రీసాయి, ఆర్.జశ్వంత్, చిత్తూరుకు చెందిన కె.వింధ్యస్ జట్టులో స్థానం దక్కించుకున్నారు.


పొల్లూరు జలపాతం వద్ద శిక్షణలో పాల్గొన్న తెలంగాణా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

తెలంగాణ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు

పొల్లూరు జలపాతం వద్ద శిక్షణ

మోతుగూడెం, అక్టోబరు 20: చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం తెలంగాణ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఆంధ్రాలో పొల్లూరు జలపాతం వద్ద టేక్ ప్లాంటేషన్ వద్ద అటవీ ప్రాంతంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. లక్కవరం రేంజర్ సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, లక్కవరం రేంజర్ నానాజీ, డీఆర్వో భాను ప్రకాష్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



తలుపులమ్మ ఆలయానికి రూ.3.27లక్షల ఆదాయం

తునిరూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి తరలివచ్చిన భక్తజనంతో ఆలయంలో అమ్మవారి నామస్మరణ మార్మోగింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారి విశేషలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక క్యూలైన్‌లో బార్లు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం సమకూర్చిన వసతి గదులు, ఆరుబయట వంట షెడ్డుల్లో భక్తులు వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాద్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం ఒక్కరోజే అమ్మ వారికి రూ.3.27లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి..

టీకాస్త్రం

- వారి భవితకు టీకాలే రక్ష ● ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గర్భిణులు, పిల్లలకు పదేళ్ల వరకూ టీకాలు
- అలసత్వం వహిస్తే అనారోగ్య సమస్యలు తప్పవు
- తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత

శంఖవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల ఇంట్లో ఆనందానికి కొదవ ఉండదు. వారు చేసే ప్రతిచర్య మనల్ని సంతోషంలో ముంచేస్తుంది. వారికి చిన్నపాటి జ్వరం వచ్చినా కన్నవారి హృదయం విలవిల్లాడుతుంది. అందుకే వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వారి సంపూర్ణ ఆరోగ్యనాకి రాష్ట్రప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. మహిళలు గర్భం దాల్చిన దగ్గర నుంచి బిడ్డకు పదో ఏట వచ్చేవరకూ అన్నిరకాల టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఈక్రమంలో టీకాల ప్రాముఖ్యత వాటిని నిర్లక్ష్యం చేస్తే కలిగే నష్టాల గురించి తల్లిదండ్రులు తప్పకుండా తెలుసుకోవాలి. టీకా అనేది చిన్నారులకు వజ్రాయుధం. అది చిన్నారుల్లో రోగనిరోధకశక్తిని పెంచి ప్రాణాంతక వ్యాధులనుంచి రక్షిస్తుంది. సరైన సమయంలో స్పందిచకపోతే జీవితాంతం పిల్లలు ఇబ్బందిపడతారు.

పదేళ్లు వచ్చే వరకూ..

మాతాశిశు సంక్షేమం కోసం ఎక్స్‌పెండెంటు ప్రోగ్రాం ఆఫ్ ఇమ్యూనైజేషన్(ఈపీఐ)ని ప్రవేశ పెట్టారు. దీన్ని యూనాని యూనివర్సల్ ఇమ్యూనైజేషన్‌గా దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టారు. గర్భిణులకు, అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి పదేళ్ల పిల్లల వరకూ ప్రభుత్వమే ఉచితంగా టీకాలను అందజేస్తోంది. పట్టణాల్లో ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు పల్లెల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీకాలను ఉచితంగా వేస్తారు. ప్రధానంగా 12 రకాల టీకాలు పిల్లలకు తప్పనిసరిగా వేయించాల్సి ఉంది. టీకాలు వేయించకపోతే వచ్చే వ్యా ధులు చిన్నారులను జీవితకాలం వేధిస్తాయి. పుట్టిన బిడ్డనుంచి పదేళ్ల వరకూ సరైన సమయంలో టీకాలు వేయించుకోవాలి. లేకపోతే క్షయ, రక్తహీనత, పోలియో, కేన్సర్, వైరల్ డయేరియా, కీళ్లవాతం, ధనుర్వాతం, తట్టు, రుబేలా, మెదడువాపు, కోరింత దగ్గు, రేచీకటి వంటి రోగాలు చుట్టుముడతాయి.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గతంలో పేదింట్లో కాన్పంటే భయపడే పరిస్థితి కానీ ఇప్పుడు అన్ని పరీక్షలు ప్రభుత్వమే చేస్తూ సాధ్యమైనంత వరకూ సాధారణ కాన్పులు అయ్యేలా మందులు వేస్తున్నారు. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. దీనిలోభాగంగా ప్రతినెలా ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తూ దూర ప్రాంతాలనుంచి వచ్చే తల్లులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, తల్లులకు ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారు.

సబ్ సెంటర్లలోనే టీకాలు

ప్రతివారం ఆరోగ్య ఉపకేంద్రాల్లో టీకాలను ఉచితంగా అందిస్తున్నారు. మాతాశిశు పేరుతో తల్లులకు ఒక పుస్తకాన్ని అందించి అందులో టీకాల వివరాలను పొందుపరుస్తారు. టీకాకు వచ్చిన సమయంలో మళ్లీ ఏ తేదీ రావాలి, మళ్లీ వచ్చినప్పుడు వేసే టీకా ఏంటని పుస్తకంలో తెలియజేస్తారు. టీకాలను ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలను తీసుకొచ్చి ఐస్‌బాక్సులో భద్రపరుస్తారు. టీకా వేశాక చిన్నారులను గమనించి కొద్దిసమయం పోయాక పంపిస్తారు.


కత్తిపూడి సబ్‌సెంటర్‌లో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

ప్రధానంగా వేయించాల్సిన టీకాలు

వయస్సు	ఇవ్వాల్సిన వ్యాక్సిన్లు
పుట్టిన వెంటనే..	బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బీ,
6 వారాలకు..	పెంటావాలెంట్-1, ఓపీవీ-1, ఐపీవీ-1, రోటావైరస్ వ్యాక్సిన్ 1, పీసీవీ
10వారాలకు..	పెంటావాలెంట్ -2, ఓపీవీ-2, రోటావైరస్ వ్యాక్సిన్-2
14 వారాలకు..	పెంటావాలెంట్ -3, ఓపీవి-2, ఐపీవీ-2, రోటావైరస్-3, పీసీవీ
9 నెలలకు..	మిజిల్, జేఈ-1, విటమిన్ ఏ-1పీసీవీ
16 నెలలకు..	టీపీటీ, ఓపీవీ, మీజిల్స్ విటమిన్ ఏ-2(బూస్టర్)
5-6 సంవత్సరాలకు..	టీపీటీ, విటమిన్-ఏ 9వ డోస్
10, 16 సంవత్సరాలకు..	టీడీ డోస్
గర్భిణికి..	12వారాలలోపు టీడీ-1, 4వారాల తర్వాత డీటీ-2

తల్లిదండ్రులు తెలుసుకోవాల్సినవి..

కార్పొరేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. ప్రభుత్వం, వైద్యులు ఎన్నిరకాల సలహాలు, సూచనలు చేసినా పిల్లల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులదే ప్రధాన భూమిక. గర్భం దాల్చిన దగ్గరనుంచి చిన్నారులకు పదేళ్లు వచ్చేవరకూ వ్యాక్సిన్ల విషయంలో పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలి. ఏ టీకా దేనికి వేశారు, మళ్లీ తర్వాత టీకా ఎప్పుడు వేయించుకోవాలి, టీకా వేశాక కార్డులో నమోదు చేశారా లేదా అనే విషయాలను పరిశీలించుకుని కార్డును భద్రపరుచుకోవాలి. నెలసరి బరువు చెక్ చేసుకోవడం వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. కొన్నిసార్లు టీకాలు వేసినప్పుడు సైడ్ ఎఫెక్ట్‌లు వస్తుంటాయి. వాటిపై వైద్యులను అడిగి తగిన సలహాలు పాటించాలి.

రైఫిల్ షూటింగ్‌లో జాతీయ జట్టు ఎంపిక

ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్


ఓపెన్‌సైట్ కేటగిరీలో రైఫిల్ షూటింగ్‌లో ఓవరాల్ చాంపియన్‌గా మొదటిస్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

దివాన్‌చెరువు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఓపెన్‌సైట్ కేటగిరీ విభాగంలో పాల్గొనే జాతీయ జట్టును ఎంపికచేసినట్టు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపికైన రాష్ట్ర జట్టును ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి ప్రకటించారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో అండర్-14 బాలికల విభాగంలో వి.జాగృతిరెడ్డి(వైఎస్ఆర్ కడప), ఎస్.జోహస్రిద్రా(తూర్పుగోదావరి), డి.సౌమ్యశ్రీ (పశ్చిమగోదావరి), అండర్ -14 బాలురు విభాగంలో ఎ.లిఖిత్‌రామ్ (పశ్చిమగోదావరి), డి.వేద్‌వీక్షిత్(తూర్పుగోదావరి), వి.తీక్షణసాయి (అనంతపురం) ఎంపికయ్యారని స్వామి తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో ఎం.సాయి ఐశ్వర్య(కర్నూలు), సి.గురుప్రవల్లిక(అనంతపురం), వి.ఫైజాసుల్తానా(వైఎస్ఆర్ కడప), అండర్-17 బాలుర విభాగంలో ఎస్ఎండీ ఉబయిద్(వైఎస్ఆర్ కడప), పి.సాయి సుమేష్(తూర్పుగోదావరి), ఎల్.రామ్‌జిగ్నేష్(కర్నూల్) ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్-19 బాలికల విభాగంలో ఎస్‌డీ మహేజమీన్(వైఎస్ఆర్ కడప), ఎం.పల్లవి (కర్నూల్), ఎం.మల్లికాబాయ్(అనంతపురం), అండర్-19 బాలురు విభాగంలో ఏవీ సూర్య రామసంజీవరెడ్డి(వైఎస్ఆర్ కడప), టి.వెంకట అఖిల్ (అనంతపురం), డి.సాయితేజ(తూర్పుగోదావరి) ఎంపికయ్యారన్నారు. ఓవరాల్ చాంపియన్‌లు అనంతపురం, కర్నూల్, వైఎస్ఆర్ కడప జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయని స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో ఎంపికైన జట్టు డిసెంబరు 24 నుంచి వచ్చేఏడాది జనవరి ఒకటో తేదీ వరకూ భోపాల్‌లో జరిగే జాతీయపోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఉపవిద్యాశాఖాధికారి నారాయణ, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి, పీఈటీలు పాల్గొన్నారు.

అందరి హృదయాల్లో నిలిచిన రాజబాబు

హాస్య నటుడు రాజబాబు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 20: ప్రముఖ హాస్య నటుడు రాజబాబు 88వ జయంతి వేడుకలు ఆదివారం గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజబాబు తమ్ముడు బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాజబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజబాబు 590 చిత్రాల్లో నటించి అందరి హృదయాల్లో చిరస్థాయిగానిలిచిపోయారన్నారు. రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, వెంకటేశ్వరరావు, పట్నాయక్, గణేష్, లక్ష్మీనారాయణ, మల్లు రవి పాల్గొన్నారు.


హాస్యనటుడు రాజబాబు విగ్రహం వద్ద జయంతి వేడుకలు దృశ్యం

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు గండేపల్లికి చెందిన కాజులూరి రమణ(60) జాతీయ రహదారిపై ఎస్‌బీఐ బ్యాంకువద్ద రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన ఎస్‌ఐ యువీ శివనాగబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓ స్వామీ..నీ సేవ చేసే

భాగ్యం ఎవరిదో

అర్చకుల మధ్య ఆధిపత్య వివాదం

నివ్వెరపోయిన భక్తులు

పోలీసులకు ఫిర్యాదు


శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం

కొత్తపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వస్వామి దేవాలయంలో స్వామికి సేవచేసే భాగ్యంపై ఇద్దరు అర్చకుల మధ్య వివాదం గ్రామంలో భక్తుల మధ్య మనోభావాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. భక్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ దేవాలయంలో గతంలో పనిచేసిన రమేష్ అనే అర్చకుడికి, ప్రస్తుతం పనిచేసే కప్పగంతుల రవితేజ అనే అర్చకుడికి మధ్య స్వామిచేసే భాగ్యంపై ఒకరికొకరు వివాదాలకు పోతున్నారు. ఈ ఇద్దరు గొడవలకు పోయి స్వామికి కైంకర్యాలు దూరమయ్యే రీతిలో గతంలో అర్చకుడిగా పనిచేసిన రమేష్ గుడికి తాళాలు వేసి వెంట తీసుకెళ్లారని భక్తులు ఆదివారం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరికొద్దిరోజుల్లో కార్తీకమాసం ప్రారంభం కానున్నది. కార్తీకమాసం ప్రారం భం నాటికి ఈ వివాదాన్ని పరిష్కరించి స్వామికి యథారీతిలో పూజలు చేసుకునే భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం నిమిత్తం దేవదాయ, ధర్మదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు కొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్

కాకినాడ సిటీ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పశ్చిమ-తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ని ఖరారు చేసినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు అలాగే కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎంపిక చేశారు.

దేశభక్తిని పెంపొందించడంలో భారత్ వికాస్ కృషి

ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ

కొవ్వూరులో జాతీయస్థాయి బృందగాన పోటీలు


జాతీయ బృందగాన పోటీలలో పాల్గొన్న నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడిలో విద్యార్థి దశ నుంచి దేశభక్తిని పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ కృషి చేయడం అభినందనీయమని ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. ఆదివారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపంలో డాక్టర్ రమేష్ యల్లాప్రగడ అధ్యక్షతన భారత్ వికాస్ పరిషత్ ప్రాంత జాతీయ బృందగాన పోటీలను నిర్వహించారు. హిందీ, తెలుగు, సంస్కృతం, జానపద గీతాల పోటీలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, డాక్టర్ కేఎస్ఎన్ మూర్తితో కలిసి ప్రభాకరశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ సమర్పణ్ పరమావిధిగా విద్యార్థుల్లో దేశభక్తి, సేవాతత్పరతను పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ 62 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఈ పోటీల్లో హిందీ, సంస్కృత విభాగాల్లో 8 బృందాలు, తెలుగు, జానపద విభాగాల్లో 9 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి డీఏవీ స్కూల్ అనకాపల్లి, ద్వితీయ బహుమతి విశాఖ వ్యాలీ విశాఖపట్నం, తృతీయ బహుమతి శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాయకరావుపేట, మోటివేషన్ బహుమతి డీవీఏ పాఠశాల కొవ్వూరు బృందాలు ఎంపికయ్యాయి. ప్రథమస్థానంలో నిలిచిన డీఏవీ స్కూల్ అనకాపల్లి బృందం హిందీ, సంస్కృత విభాగంలో సౌత్ విభాగం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఈ పోటీల్లో విశాఖపట్నం, కొవ్వూరు, తుని, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కుమారదేవంకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి గేయాలు ఆలపించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడోజు సాయికృష్ణ, సౌత్ రీజియన్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమశాస్త్రి, రీజనల్ జాయింట్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ, బి.సుబ్బారావు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

రాజానగరంలో విద్యుత్ హైవోల్టేజ్ సరఫరా

గృహోపకరణాలు దగ్ధం

రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం

పట్టించుకోని విద్యుత్‌శాఖాధికారులు

గగ్గోలు పెడుతున్న వినియోగదారులు


హై ఓల్టేజీతో దగ్ధమైన విలువైన గృహోపకరణాలు

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని రాజానగరంలోని వైఎస్సార్ జంక్షన్ సమీపంలోని నివాసితులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తమ ప్రాంతంలో విద్యుత్ హెచ్చుతగ్గులు రావడంతో దాదాపు 15కుటుంబాలకు సంబంధించిన టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, కూలర్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, కంప్యూ టర్లు, ల్యాప్‌లాప్‌లు, పరుపులు తదితర విలువైన గృహోపక రణాలు దగ్ధం కావడంతో సుమారు రూ.10లక్షలు మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు. గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని ఇంతవరకు ఇటువంటి పరిస్థితులు చూడలేదన్నారు. సుమారు 50సార్లుగా అప్పటికప్పుడే హైవోల్టేజీ, వెంటనే లోవోల్టేజీ రావడం వల్లనే ఈ ఇబ్బందులు తలెత్తినట్లు బాధితులు రాయుడు విజయ భారతి, గోకా దేవి, నీలపాల వీర్రాజు, మంద సత్తిబాబు, ప్రగడ సుబ్బారావు తెలిపారు. ఈవిషయమై రాజానగరం విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా ప్రమాదం జరిగినమాట వాస్తవమే అయితే ఆ ప్రాంతంలో కొంతమంది ఇళ్లకు ఎర్త్‌లు సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని బదులిచ్చారు.

పాదగయ క్షేత్రంలో

కాంట్రాక్టు లెక్చరర్ల హోమం, పొర్లుదండాలు

పిఠాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో తమను రెగ్యులరైజ్ చేయాలంటూ ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. అర్థాంతరంగా నిలిచిపోయిన క్రమబద్దీకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి కావాలని కోరుకుంటూ పురుహూతికాఅమ్మవారికి లెక్చరర్లు పొర్లుదండాలు పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని తమను రెగ్యులరైజ్ చేయడం ద్వారా నాలుగు వేల కుటుంబాల్లో వెలుగులు నింపాలని వారు విన్నవించారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్దీకరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దశలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పిఠాపురం, మంగళగిరి, కుప్పంలో గణపతిహోమాలు నిర్వహించినట్లు గవర్నమెంట్ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి టీజే గాంధీ, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్‌లు తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమాల్లో ఉమ్మడి ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.


పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికాఅమ్మవారికి పొర్లుదండాలు పెడుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

గిరిజన పసిబిడ్డల ఆరోగ్యానికి రక్షణేది?

డోలీ మోతలే కాదు... పసిబిడ్డల మరణాలూ ఉండొద్దు

ముఖ్యమంత్రి ఎంత చెబుతున్నా మారని వైద్యసేవల తీరు


మృతిచెందిన పసిబిడ్డతో తల్లి (ఫైల్)

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మన్యంలో అసలు డోలీ మోతలు, వైద్యసేవల నిర్లక్ష్యం ఉండొద్దంటూ ఏకంగా కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత ఏకరవుపెట్టినా ఇక్కడ పరిస్థితులు ఏమీ మారడంలేదు. డోలీ మోతలు నిరోధించడం ఇప్పటి కిప్పుడు సాధ్యం కాకపోవచ్చు, కానీ సకాలంలో ఆసుపత్రు లకు చేరుకున్నా మెరుగైన వైద్యాన్ని పొందలేని దుస్థితిని అల్లూరి మన్యంలోని రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రులలో వైద్యులకు కొదవలేకపోయినా, పరిపాలనా వైఫల్యాలతో వారి సేవలకు కొదవ ఏర్పడుతోంది.

మొక్కుబడి వైద్యం

వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీలోని జి.కొత్తూరు గ్రామానికి చెందిన పావని అనే తన మూడు నెలల పసిబిడ్డను తీసుకుని గొలారి దాలిమ అనే మహిళ బుధవారం గుర్తేడు పీహెచ్‌సీకి తీసుకువస్తే, అక్కడ ఏదో మొక్కుబడిగా చూసి అందుబాటులో ఉన్న మందులను ఇచ్చి ఇంటికి పంపించేయగా, అదేరోజు రాత్రి ఆ పసిబిడ్డ మృతి చెందింది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పసిపిల్లల కోసం 24 గంటలూ పనిచేసే ఓ విభాగం నడుస్తోందని తెలిసీ కూడా ఆ పసి బిడ్డను మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు రిఫర్ చేయకుండా ఆబిడ్డ మరణానికి గుర్తేడు వైద్యులు, సిబ్బంది పరోక్షంగా కారణమయ్యారు.

ప్రాణాపాయస్థితిలో పసిబిడ్డలు

ఇదిలావుండగా అదే గుర్తేడుకు చెందిన కడబాల లింగారెడ్డికి చెందిన పసిబిడ్డను కూడా మూడురోజుల క్రితం అనారోగ్యంతో గుర్తేడు పీహెచ్‌సీకి చేర్చితేపై మాదిరిగానే తోచిన వైద్యంచేసి ఇంటికి పంపించేశారు. ఆ బాలుడి ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఓ ఆశా వర్కర్ సూచనతో తల్లిదండ్రులు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా తోచిన వైద్యం చేసి రాజమండ్రికి తరలించారు. అక్కడ కూడా ఇదే తంతు జరిగి, కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఇపుడు అక్కడ ఆ బిడ్డ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

అలంకారంగానే ఆరోగ్య కేంద్రం

ఈ రెండు ఘటనలపై గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు తీవ్రంగా స్పందించారు. తమ గుర్తేడులో ఆరోగ్య కేంద్రం కేవలం అలంకారంగానే మారిందని, పేరుకు మాత్రమే ముగ్గురు వైద్యులు ఉంటారని, వారి సేవలు ఎప్పుడు తవకు అందుబాటులో ఉంటాయో వారికే తెలియదని, ఈ ఘటనలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్టు కూడా ఆయన తెలిపారు.ఇవి కేవలం వెలుగులోకి వచ్చినవి మాత్రమే! వెలుగులోకి రాకుండా ఎన్నో పసిబిడ్డల మరణాలు మన్యం నిండా చోటు చేసుకుంటున్నా, మంచి ప్రభుత్వం వచ్చిందన్న ఆశలను అడియాశలను చేస్తూ వైద్య సేవలను ఎటువంటి మౌళిక సదుపాయాలు లేని రోజులకంటే దయనీయ స్థితికి దిగజార్చుతున్నారు.

రత్నగిరిపై సర్వర్‌లు పనిచేయక నిలిచిన సత్రం గదుల కేటాయింపు

అన్నవరం, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సర్వర్‌లు పనిచేయక సత్రం గదులు కేటాయింపు నిలిచిపోయాయి. ఒక పక్క పెళ్లిల్లు ఉంటం మరోక పక్క సత్యదేవుని దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. కేవలం రిజర్వేషన్ చేసుకొన్న ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తులకు గదులు కేటాయించారు. మిగతావారు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం మూడున్నర నుంచి రాత్రి 7.30 వరకు ఈసమస్య ఉత్పన్నమైయింది. తరువాత 8గంటల ప్రాంతంలో టెక్నికల్ సిబ్బంది దీన్ని పరిష్కరించిన తరువాత గదులు కేటాయింపు చేపట్టారు. అయితే ఇది అన్నవరం దేవస్థానం తప్పిదం కాదని, దీనికి సాఫ్ట్‌వేర్ వల్ల సమస్య వచ్చిందని అధికారులు తెలిపారు.

హెల్త్ సెక్రటరీల ప్రావిజినల్ సీనియారిటీ లిస్ట్ విడుదల

కాకినాడ క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల ప్రావిజినల్ సీనియారిటీ లిస్ట్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న గ్రామ,వార్డు హెల్త్ సెక్రటరీల సీనియారిటీ లిస్ట్ తయారు చేయాల్సిందిగా మంగళగిరి ప్రధాన కార్యాలయంనుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. మా వద్ద ఉన్న సమాచారం నవీకరణ చేసి సంబంధిత పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీపీ యూనిట్లు మున్సిపల్ కమిషనర్లు, రంపచోడవరం పీవో వారికి ప్రావిజినల్ సీనియారిటీ లిస్ట్ జతచేయడం జరిగిందన్నారు. ఈ లిస్ట్‌లను సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాత సమాచారం సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని కోరారు. ఏమైనా మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటలలోపు నమోదు చేసుకోవాలని కోరారు.

సత్యదేవుడికి రథోత్సవం


టేకురథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 20: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొని వచ్చి టేకురథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితులు మంత్రోచ్ఛరణల నడుమ తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

బీజేపీ సభ్యత్వాల జోరు

మండపేట,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాలు మండపేట నియోజకవర్గంలో వేగ వంతంగా చేస్తున్నామని నియోజక వర్గ బీజేపీ ఇన్‌చార్జి కె.సాయిరాం చెప్పారు. జిల్లా బీజేపీ నాయకులతో కలిసి ఆయన కేశవరంలో ఆదివారం సభ్యత్వాలను నమోదు చేశారు. ఆదివారం కేశవరంలో 12 బూత్‌ల్లో బీజేపీ నాయకుడు సంగిశెట్టి శ్రీనివాస్ నేతృత్వంలో 48మందితో సభ్యత్వాలు చేయించారు. స్థానిక నాయకులు మర్రి రామచంద్ర రావు, ఆర్ఎస్ఎస్‌నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం-అంబాజీపేట రహదారి యమ డేంజర్

- అధ్వాన రహదారికి మోక్షం కలిగించండి
- భారీ వర్షంతో రహదారి జలమయం
- ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు




భారీ వర్షాలతో పి.గన్నవరం-అంబాజీపేట రహదారి దుస్థితి

పి.గన్నవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం-అంబాజీపేట అధ్వాన రహదారికి మోక్షం కలిగించండి మహాప్రభో అంటూ వాహన దారులు, స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. ఈరహదారి మీటర్‌కు గొయ్యి చొప్పున గోతులతో చాలా అధ్వానంగా ఉంది. రాత్రి సమయంలో ఈరహదారిలో కొత్తవారు ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురికాకతప్పదు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారి జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గోతుల్లో వర్షం నీరు చేరడంతో ద్విచక్ర వాహన దారులు నానావస్థలు పడ్డారు. ఈరోడ్డుపై నరక యాతనను భరించలేక ఇటువైపు వాహన దారులు రావడానికి సంకోచిస్తున్నారు. అమలాపురం నుంచి పి.గన్నవరం పరిసర ప్రాంతాలకు రావాలంటే ఇదేరోడ్డు తప్ప మరో ప్రత్యామ్న రహదారి లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబాజీపేట నుంచి ఆరు కిలోమీటర్లు ఉంటుందని, ప్రయాణానికి గంట సమయం పడుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పి.గన్నవరం నుంచి అంబాజీపేట వరకు రహదారి అభివృద్ధికి రూ.8కోట్లు నిధులు మంజూరు కావడంతో వైసీపీ ప్రభుత్వం హయాయంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావిడిగా భూమి పూజచేశారు. అయితే అప్పటికే పలు రహదారులను అభివృద్ధి చేసిన కాంట్రాక్టరు వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఈరహదారి పనులు చేయడానికి కాంట్రాక్టరు ముందుకు రావడంలేదని తెలిసింది. గోతుల్లో వర్షం చేరడంతో రహదారులు మరింత దహనీయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈరహదారికి మోక్షం కల్గించాలని, కనీసం గోతులను పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని అధికారులు, నాయకులను ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల్లో తాగునీటికి ఇక్కట్లు

- మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లు
- భోజన సమయంలో విద్యార్థులకు తిప్పలు
- పట్టించుకోని ఆ శాఖాధికారులు





అంబాజీపేట: తొండవరంలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్, పుల్లేటికుర్రులో ఆర్వో ప్లాంటుకు తాళం వేసిన దృశ్యం, వాటర్ బాటిల్స్‌తో భోజనం చేస్తున్న విద్యార్థులు

అంబాజీపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వో ప్లాంట్లను ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో మరమ్మతుల చేసిన్నపటికి తిరిగి మరమ్మతులకు గురవుతున్నాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 20 వేలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. అంబాజీపేటలో 4,992, అయినవిల్లిలో 3953, పి.గన్నవరంలో 6,041, మామిడికుదురులో 4,461 విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు 2020లో వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో వీటిని అందించారు. వీటిని అప్పట్లో ప్రజాప్రతినిధులు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించి ప్రతి విద్యార్థికి రక్షిత మంచినీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే వాటిని ప్రారంభించిన ఆరు నెలలకే ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో విద్యార్థులు భోజన సమయంలో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిల్స్‌తోనే భోజనాలు చేస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో పైపులు ద్వారా బాటిల్స్‌తో పట్టుకుని విద్యార్థులు మంచినీటిని తాగుతున్నారు. అలాగే పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, దాతల ద్వారా తాగునీటి క్యాన్లను కొనుగోలు చేసి పాఠశాలలో విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నారు. ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయని ప్రభుత్వం ఏర్పాటుచేసిన యాప్ ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. అంబాజీపేట మండలం తొండవరం హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురికావడంతో ఉపాధ్యాయులు మరమ్మతులు చేయించారు. అయితే అక్కడ తిరిగి ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురికావడంతో చేసేది ఏమీలేక అలాగే ఉంచేశారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాఠశాలకు క్యాన్ల ద్వారా మంచినీటిని ఉచితంగా అందిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ఇటీవల ఎంపీడీవోకు వివరించినప్పటికి ఫలితం లేకపోయింది. పుల్లేటికుర్రులో ఆర్వో ప్లాంట్‌కు తాళాలు వేశారు. దాదాపు నియోకవర్గంలో ఉన్న అన్నిపాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్వాగతం పలుకుతున్న 'చెత్త' వాహనాలు

- నగర పంచాయతీ కార్యాలయం ఎదుట చెత్త తొలగించే వాహనాలు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు పార్కింగ్
- 24 గంటల్లో తొలగించాలని చైర్మన్ ఆదేశం
- ఇరవై నాలుగు రోజులైనా ఫలితం శూన్యం




నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసిన చెత్త తొలగించే వాహనాలు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు

ముమ్మిడివరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయితీ కార్యాలయం ఎదుట చెత్తను తొలగించే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు....సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు కూడా ప్రైవేటు వ్యక్తులు ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు.... కార్యాలయానికి వచ్చే ప్రజాప్రనిధులకు, ప్రజలకు ఇది ఇబ్బందికరంగా వాటిని చూడటానికి అసహ్యంగా ఉంది. 24 గంటల్లో వాటని అక్కడ నుంచి తొలగించాలని నగర పంచాయితీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించినా వాటిపై చర్యలు శూన్యం. ఇది జరిగి నేటికి 24రోజులు అయింది. అయితే వాటిని ఇంకా అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. గత నెల 24న జరిగిన నగర పంచాయితీ కౌన్సిల్ సమావేశంలో స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు సంబంధించి చెత్తను తొలగించేందుకు నగర పంచాయతీకి సమకూర్చిన వాహనాలు, ప్రైవేటు వ్యక్తులకు చెందిన సెప్టిక్ క్లీనర్లను నగర పంచాయతీ ఆవరణ నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను చైర్మన్ ఆదేశించగా కౌన్సిలర్లు కూడా వాటిని అక్కడ నుంచి తొలగించి చైర్మన్ ఆదేశాలను గౌరవించాలని నాటి సమావేశంలో అధికారులకు సూచించారు. వార్డుల్లో చెత్తను తొలగించేందుకు ముమ్మిడివరం నగర పంచాయతీకి సంబంధించి ఏడు వార్డు సచివాలయాలకు ఒక్కొక్క వాహనాన్ని సమకూర్చారు. చెత్తను సేకరించిన తరువాత ఆ వాహనా లన్నింటిని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేస్తున్నారు. వీటితో పాటు ప్రైవేటు వ్యక్తులకు చెందిన సెప్టిక్ క్లీనర్లను కూడా నగర పంచాయతీ వద్ద పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేయవద్దని పదే పదే చైర్మన్ ఆదేశించినా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడాన్ని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ఆర్.ఏనుగుపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు

పి.గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీ శివారు గ్రామాలకు పక్కా రహదారులను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేపట్టిందన్నారు. అనంతరం లంకలగన్నవరంలో రూ.15లక్షలు, మొండెపులంకలో రూ.5లక్షలు, నాగుల్లంకలో రూ.25లక్షలు, వాడ్రేవుపల్లిలో రూ.15లక్షలు, మానేపల్లిలో రూ.5 లక్షలు, ఆర్.ఏనుగుపల్లిలో రూ.10 లక్షలు, కె.ఏనుగుపల్లిలో రూ.10 లక్షలు, వై.కొత్తపల్లిలో రూ.5లక్షలు, కె.ముంజ వరంలో రూ.10లక్షలు నిధులతో అభివృద్ధి చేయనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, మట్టపర్తి రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాలు శ్రీవెంకటసత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, యాండ్ర శ్రీనివాసరావు, అన్నాబత్తుల వెంకటేశ్వరావు, తాటికాయల శ్రీనువాసరావు, యడ్ల ఏసు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు యానాంలో న్యాయశాఖ కార్యదర్శి పర్యటన

యానాం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరికి చెందిన న్యాయశాఖ కార్యదర్శి డాక్టర్ ఎల్.ఎ.సత్యమూర్తి సోమవారం యానాం పర్యటనకు రానున్నారని పరిపాలనాధికారి మునిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరిలోని అన్ని రీజియన్లలో వివిధ శాఖల కార్యదర్శులు నెలలో ఒక్కసారైనా పర్యటించి నివేదిక సమర్పించాలని పుదుచ్చేరి గవర్నర్ కె.కైలాష్‌నాథన్ ఆదేశాల మేరకు యానానికి వివిధ శాఖల కార్యదర్శులు రానున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒక కార్యదర్శితో పాటు డైరెక్టర్ పర్యటన ముగిసింది. సోమవారం న్యాయశాఖ కార్యదర్శి రానున్నారు. చివరివారంలో మరోశాఖ కార్యదర్శి, డైరెక్టర్ యానాం రానున్నట్లు తెలిసింది.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ద్రాక్షారామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మాలపాడు, తాడిపల్లి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులు ఆదివారం శంకుస్థాపన చేశారు. మాలపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ నేమాల సుజన సంతోష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నబాబు, కూటమినాయకులు విత్తనాల వెంకటరమణ, కొత్తపల్లి శ్రీను, దంగేటి గౌరీశంకర్, కురుపూడి దుర్గ, నామాడి ఆనందరావు, మేడిశెట్టి సూర్యారావు, బత్తుల వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంటు నున్న వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. తాడిపల్లిలో రూ.9లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపిటీసీ సభ్యుడు రెడ్డం సతీష్ శంకుస్థాపన చేశారు. ఉపసర్పంచ్ పలివెల ముసలయ్య, పంచాయతీ కార్యదర్శి చిక్కాల నారాయణ రావు, కొప్పిశెట్టి గోవిందు, సాద బాబులు, డెక్కా గిరి, పిల్లి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం

కె.గంగవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈఏడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి గ్రామ సభ ఆమోదం తీసుకోవడం జరిగిందన్నారు. గ్రామసభలో ఆమోదం పొందిన పనులను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా భూమిపూజ చేసి సంక్రాంతి నాటికి పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించిందన్నారు. బాలాంత్రంలో రూ.31 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. త్వరలో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం, కె.గంగవరం ఎంపీడీవోలు పద్మజ్యోతి, శ్రీనివాస్, పీఆర్ ఏఈ ఏసురత్నం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి




మామిడికుదురులో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవ, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మామిడికుదురు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గెద్దాడ, మామిడికుదురు, కొమరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో నిర్మించే రోడ్లకు ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని, గ్రామాల అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగితెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ప్రాధాన్యంక్రమంలో గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు, మెండ ఆదినారాయణ, సర్పంచ్ గౌస్ మోహిద్దీన్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, నాయకులు వర్ధినీడి వెంకట్రామయ్య, సాపె ఏకదాశి, ఇంటి మహేంద్ర, రుద్ర శ్రీను, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలపై అవగాహనకు పరీక్ష



అమలాపురం వాగ్దేవిస్కూల్‌లో పోస్టల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పరీక్ష జరుగుతున్న దృశ్యం

అమలాపురం టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాల గురించి తెలియజేసేందుకు అమలాపురం డివిజన్ తపాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం దీన్‌దయాల్ స్పర్శ యోజన పరీక్ష నిర్వహించారు. అమలాపురం వాగ్దేవి స్కూల్‌లో పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఆటిట్యూడ్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టాంప్స్ అండ్ హ్యాబీస్‌పై విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన 278మంది విద్యార్థులు పాల్గొన్నారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధర్‌తో పాటు పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సపక్‌తక్రా పోటీల్లో పతకాలు సాధించాలి



సపక్‌తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో తాతబాబు తదితరులు

అమలాపురం టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 22,23తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జవ్వాది తాతబాబు, కేతా సాయిదుర్గాప్రసాద్ చెప్పారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ హెచ్ఎం స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. జిల్లా మెన్స్ విభాగం జట్టులో కెప్టెన్‌గా పాటి సన్ని, కేతా సతీష్, సీహెచ్ మోహనకృష్ణ, జి.బాల నాగసుభాష్, కోసూరి ప్రసాద్ పాల్గొంటారు. ఉమెన్స్ జట్టు కెప్టెన్‌గా బి.జ్యోతి, డి.రాజేశ్వరి, డి.ప్రియాంక, ఐ.లక్ష్మీదుర్గా, జి.సిమ్లా పాల్గొంటారు. టీమ్ మేనేజర్‌గా సైదుల రమణ వ్యవహరిస్తారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా జట్ల క్రీడాకారులను కళాశాల పాలకవర్గ సభ్యులు నడింపల్లి సుబ్బరాజు, డీఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ తదితరులు అభినందించి క్రీడా కిట్లు అందజేశారు.

జాతీయస్థాయి అవార్డు అందుకున్న మెజీషియన్ అలీ



మామిడికుదురు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మలయాళీ మెజీషియన్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి ఇంద్రజాల ఫెస్టివల్‌లో నగరం గ్రామానికి చెందిన మెజీషియన్ అలీ పాల్గొని అవార్డుతో పాటు రూ.లక్ష నగదును గెలుచుకున్నాడు. ఈఅవార్డు క్రింద జాతీయస్థాయిలో ముగ్గురిని ఎంపిక చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి అలీ ఒక్కడే ఉండటం విశేషం. 36ఏళ్లుగా వివిధ దేశాలతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏడువేల ప్రదర్శనలు చేసినందుకు ఈఅవార్డుకు ఎంపిక చేశారు. అలీని స్థానికులు అభినందించారు.

పల్లె పండుగతో అభివృద్ధి పరుగులు



గున్నేపల్లి అగ్రహారంలో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, అక్టోబరు 20(ఆంధ్ర జ్యోతి): పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. పేరూరు, సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం, నడిపూడి, సమనస గ్రామాల్లో పల్లె పండుగ పేరిట సీసీ రోడ్లు, డ్రైయిన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, సర్పంచ్‌లు దాసరి అరుణ, గుత్తుల చిరంజీవిరావు, పెద్దిరెడ్డి రామచంద్రరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు చొల్లంగి సత్యసాయిబాబా, పొలమూరి ధర్మపాల్, ముత్తాబత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో దీపోత్సవం



రాధా కృష్ణులను ఊరేగిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో దామోదరమాసం సందర్భంగా ఆదివారం దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గరుడవేగ టీమ్, రామ సేతు భక్త బృందం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు పిల్లల సాంస్కృతిక నృత్యాలు, అనంతరం గ్రామ పురవీధుల్లో రాధాకృష్ణుల ఊరేగింపు జరిగింది. సాయంత్రం హరతి, నైవేద్యం సమర్పణ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉచిత బస్సు ప్రయాణ హామీని అమలు చేయాలి



మామిడికుదురులో బస్సు ప్రయాణం చేస్తూ మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణ హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి నగరం నుంచి పాశర్లపూడి వరకు బస్సులో ప్రయాణం చేశారు. ప్రయాణికులతో ఉచిత బస్సు ప్రయాణ హామీని అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాయించారు. కార్యక్రమంలో మాచవరపు శ్రీమన్నారాయణ, మహ్మద్ హరీఫ్, ఒంటేద్దు బాబి, అప్పన శ్రీరామకృష్ణ, గెద్దం వెంకటేశ్వరావు, కుడిపూడి శ్రీనివాస్, కొండేటి వెంకటేశ్వరావు, బొంతు రాజేంద్రప్రసాద్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి చినరాజప్ప పరామర్శ



సన్నవిల్లిలో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

ఉప్పలగుప్తం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి మాజీ సర్పంచ్, తన ప్రియమిత్రుడు గనిశెట్టి వీరాస్వామినాయుడు ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరామర్శించారు. నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తన సహచరునిగా టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి నాయుడు చేసిన కృషిని గుర్తు చేశారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, సర్పంచ్ చిక్కం జంగమయ్య, గొలకోటి సత్తిరాజు, యాళ్ళ బాబ్జి, గనిశెట్టి రాము, కాగిత సత్యనారాయణ, చిక్కం గాంధీ తదితరులున్నారు.

సహాయం అందజేత

కె.గంగవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బాలాంత్రానికి చెందిన ప్రత్తి వెంకటరమణ కాళ్లు చేతులు లాగేయడంతో మం చంపై కదలలేని స్థితిలో ఉన్నాడు. ఆదివారం మంత్రి సుభాష్ రూ.5వేలు, కూటమి నేత మల్లిపూడి బుజ్జి రూ.5వేలు బాధితుడికి అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లో 11కేవీ వెల్ల ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా ఈనెల22న (మంగళవారం) ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. వెల్లసావరం, వెల్ల, తాడిపల్లి, కాపవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన ఏజీపీ లకాని

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టో బరు 20 (ఆంధ్ర జ్యోతి): ప్రభ త్వ సహాయ న్యాయవాదిగా నియమితులైన లకాని పద్మకమలకుమారి ఆదివారం మంత్రి సుభాష్‌ను కలిశారు. నివాసంలో మంత్రి సుభాష్‌ను కలిసి ఏజీపీగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభ

యానాం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవిసంధ్య, కవిత్వ పత్రిక స్థాపించి 50సంచికలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్టు కవిసంధ్య సంపాదకుడు కళారత్న డాక్టర్ శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు తెలిపారు. ఆదివారం యానాంలో వారు విలేకరులతో మాట్లాడారు. యానాం గీతాభవన్‌లో ఈనెల27వ తేదీ ఆదివారం ఉదయం 9.30గంటలకు ఈసభ జరగనుంది. ఈసందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళకవిత్వ గ్రంథావిష్కరణ, కవిసమ్మేళన కార్యక్రమాలు జరగున్నాయి. కవిసంధ్య సంపాదకుడు, కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, డాక్టర్ ఆర్.సీతారాం తదితరులు హాజరుకానున్నారు. ఈసందర్భంగా 13మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళిత సాహిత్యం తదితర)కి ముఖ్యఅతిథులు చేతుల మీదుగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయాల వద్ద అన్నసమారాధనలు

యానాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పలు అమ్మవారి ఆలయాల్లో అన్నసమారాధన నిర్వహించారు. దరియాలతిప్ప గ్రామంలో కొలువై ఉన్న శ్రీవిజయకనకదుర్గ, యు.కె.వి.నగర్‌లోని శ్రీదుర్గాదేవి, ఓల్డ్‌రాజీవ్‌గర్‌లోని శ్రీదుర్గాభవాని అమ్మవారి ఆలయాల్లో అన్నసమారాధన కార్యక్రమాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో దీపోత్సవం

పి.గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం శ్రీరాజ గోపాలస్వామి ఆలయంలో దామోదరమాసం సందర్భంగా ఆదివారం దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గరుడవేగ టీమ్, రామ సేతు భక్త బృందం ఆధ్వర్యంలో పిల్లల సాంస్కృతిక నృత్యాలు, అనంతరం వీధుల్లో రాధాకృష్ణుల ఊరేగింపు జరిగింది.

పల్లెపండుగలో రూ.6.70కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

ద్రాక్షారామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గంలో రూ.6.70కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పల్లెపండుగ కార్యక్రమంలో వెలంపాలెం, ద్రాక్షారామలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అనేది మచ్చుకైనా లేకుండా పోయిందన్నారు. దుర్భర స్థితిలో ఉన్న రహదారులను నేడు పల్లెపండుగ కార్యక్రమంలో నిర్మాణం చేపడుతున్నామన్నారు. పల్లెపండుగ వంటి కార్యక్రమం రూపొందించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెలంపాలెంలో రూ.23లక్షలతో నిర్మించనున్న సీసీ


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

రోడ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజచేశారు. రూ.17లక్షలతో నిర్మించిన గ్రామీణ మంచినీటి సరఫరా ఉప కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. శ్మశానవాటిక వద్ద రూ.5లక్షలతో నిర్మించిన షెడ్డును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ టేకుమూడి సుజాత సత్యనారాయణ, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, మాజీ ఎంపిటీసి పలివెల నాగరాజు, ఉపసర్పంచ్ సొంగ లక్ష్మి, జనసేన నాయకులు ముప్పనపల్లి గణేష్, పురంశెట్టి భీమేశ్వరరావు, ఎంపీడీవో పద్మజ్యోతి, ఏఈ యేసురత్నం, టీడీపీ నాయకులు డా. రాంబాబు, పెంకే సాంబశివరావు, వల్లూరి సురేష్, చిగురుపాటి సాయి, గ్రామస్థులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో రూ.3లక్షలతో నున్నవారివీధిలో సీసీ రోడ్డుకు మంత్రి భూమి పూజ చేశారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ద్రాక్షారామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మాలపాడు, తాడిపల్లి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులు ఆదివారం శంకుస్థాపన చేశారు. మాలపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ నేమాల సుజన సంతోష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నబాబు, కూటమినాయకులు విత్తనాల వెంకటరమణ, కొత్తపల్లి శ్రీను, దంగేటి గౌరీశంకర్, కురుపూడి దుర్గ, నామాడి ఆనందరావు, మేడిశెట్టి సూర్యారావు, బత్తుల వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంటు నున్న వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. తాడిపల్లిలో రూ.9లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపిటీసీ సభ్యుడు రెడ్డం సతీష్ శంకుస్థాపన చేశారు. ఉపసర్పంచ్ పలివెల ముసలయ్య, పంచాయతీ కార్యదర్శి, చిక్కాల నారాయణ రావు, కొప్పిశెట్టి గోవిందు, సాద బాబులు, డెక్కా గిరి, పిల్లి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సహాయం అందజేత

కె.గంగవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బాలాంత్రానికి చెందిన ప్రత్తి వెంకటరమణ కాళ్లు చేతులు లాగేయడంతో మం చంపై కదలలేని స్థితిలో ఉన్నాడు. ఆదివారం మంత్రి సుభాష్ రూ.5వేలు, కూటమి నేత మల్లిపూడి బుజ్జి రూ.5వేలు బాధితుడికి అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లో 11కేవీ వెల్ల ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా ఈనెల22న (మంగళవారం) ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. వెల్లసావరం, వెల్ల, తాడిపల్లి, కాపవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈఏడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి గ్రామసభ ఆమోదం తీసుకోవడం జరిగిందన్నారు. గ్రామసభలో ఆమోదం పొందిన పనులను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా భూమిపూజ చేసి సంక్రాంతి నాటికి పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించిందన్నారు. బాలాంత్రంలో రూ.31లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. త్వరలో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం, కె.గంగవరం ఎంపీడీవోలు పద్మజ్యోతి, శ్రీనివాస్, పీఆర్ ఏఈ ఏసురత్నం, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ తండ్రి సత్యం జన్మదిన వేడుకలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మంత్రి సుభాష్‌తండ్రి వాసంశెట్టి సత్యం జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి సుభాష్ తండ్రి సత్యానికి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేకుకట్ చేసి తినిపించారు. రామచంద్రపురం పట్టణం, మండలం, కాజులూరు, కె.గంగవరం మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సత్యాన్ని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సుభాష్ ఇంట సందడి నెలకొంది. ఈసందర్భంగా ఏరుపల్లి అయ్యప్పస్వామి అన్నదాన సమాజంలో అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.


తండ్రికి కేకు తినిపిస్తున్న మంత్రి సుభాష్

చిట్టిబాబు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

ద్రాక్షారామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తోటపేటలో దామిశెట్టి చిట్టి వీరబాబు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి ఆదివారం తోటపేటలో నియోజకవర్గ కాపు ఐక్యవేదిక సభ్యులు రూ.లక్ష అందజేశారు. కాపు ఐక్యవేదిక నాయకులు మాగాపు అమ్మిరాజు, ఆళ్ల బుజ్జి, అల్లం రామకృష్ణ, కంచర్ల చక్రి, అల్లం చంటి, మాదవరపు ప్రభాకర్, చెల్లూరి సత్యం తదితరులు నగదు అందించారు.

ఏఎంసీ నాడు అగ్రగామి.. నేడు దీనస్థితి

ఆలమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఆదాయంలో అగ్రగామిగా నిలిచిన కమిటీ నేడు కనీసం సిబ్బంది కూడా లేని దీనస్థితికి చేరుకుంది. నియోజకవర్గాల పునర్విభజనతో ఆలమూరు కమిటీ బక్కచిక్కిపోయింది. దీంతో ఉన్న కొంత సిబ్బంది మరో కమిటీకి వెళ్లిపోవడంతో పాటు కొందరు ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేయడంతో సిబ్బంది లేక వెలవెలబోతుంది. ప్రస్తుతం ఒక కార్యదర్శి, ఏడు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో అంతంతమాత్ర ఆదాయంతో నెట్టుకొస్తున్నారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గతంలో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాలు ఉండేవి. జిల్లాలో అత్యధికం రైస్‌మిల్లులు ఇక్కడ ఉండటంతో ఈకమిటీకి అధిక ఆదాయం వచ్చేది. అయితే తదుపరి ఆలమూరు కమిటీ నుంచి వేరు చేసి మండపేటలో కొత్తగా ఏఎంసీని ఏర్పాటు చేశారు. దీంతో ఆలమూరు కమిటీలో ఆలమూరు, కపిలేశ్వరపురం ఉండేవి. 2020లో మళ్లీ ఈకమిటీలో ఉన్న కపిలేశ్వరపురం మండలాన్ని నియోజకవర్గాల సౌలభ్యం కోసం మండపేట ఏఎంసీలో కలిపే


ఆలమూరు ఏఎంసీ కార్యాలయం

యడంతో ఆలమూరు కమిటీ ఆలమూరు మండలానికి పరిమితమైంది. మండపేట ఏఎంసీ ఏర్పాటు సమయంలో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని మండపేటకు బదిలీ చేయడంతో పాటు ఇక్కడ పనిచేసిన సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది ఉద్యోగ విరమణ చేయడం ప్రస్తుతం ఆలమూరు కమిటీలో ఒక కార్యదర్శి మాత్రమే ఉన్నారు. ఈయనకు తోడుగా ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు.

తగ్గిన ఆదాయ వనరులు..

ఆలమూరు ఏఎంసీ పరిధి పరిమితం కావడంతో ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. దీనికి తోడు కమిటీలో సిబ్బంది లేకపోవడంతో ఆదాయ వనరులు కూడా తగ్గినట్లుగా చెబుతున్నారు. ఆలమూరు కమిటీకి ఏడాదికి గతంలో రూ.15కోట్లు వరకు ఆదాయం వచ్చేది. అయితే ప్రస్తుతం రూ.5కోట్లు ఆదాయానికి పడిపోయినట్లుగా తెలిసింది.

కనీస వేతనంలేని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

కమిటీలో రెండున్నర దశాబ్దాలుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకపోయినప్పటికీ కనీస వేతనానికి కూడా నోచుకోవడం లేదు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారు. కేవలం రూ.15వేల నెలసరి వేతనంతో కాలక్షేపం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మా ఇబ్బందులను గుర్తించి జీతాలు పెంపు చేస్తారని కొండంత ఆశతో ఉన్నామని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం
-పి.ఎం.గోవిందరెడ్డి
కార్యదర్శి, ఏఎంసీ ఆలమూరు

ఆలమూరు ఏఎంసీలో సిబ్బంది కొరత ఉందనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మార్కెటింగ్ శాఖలో సిబ్బంది కొరత ఉంది. దీని కారణంగా సిబ్బంది నియామకాలు లేవు. కమిటీలో ఏడు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు.

నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాల జోరు


కేశవరంలో బీజేపీ సభ్యత్వాలు చేస్తున్న నేతలు

మండపేట,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాలు మండపేట నియోజకవర్గంలో వేగవంతంగా చేస్తున్నామని నియోజక వర్గ బీజేపీ ఇన్‌చార్జి కె.సాయిరాం చెప్పారు. జిల్లా బీజేపీ నాయకులతో కలిసి ఆయన కేశవరంలో ఆదివారం సభ్యత్వాలను నమోదు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుం దన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీజేపీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుం దన్నారు. ఆదివారం కేశవరంలో 1,2 బూత్‌ల్లో బీజేపీ నాయకుడు సంగిశెట్టి శ్రీనివాస్ నేతృ త్వంలో 48మందితో సభ్యత్వాలు చేయిం చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మర్రి రామచంద్రరావు, ఆర్ఎస్ఎస్‌నాయకులు పాల్గొన్నారు.

27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభ

యానాం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవిసంధ్య, కవిత్వ పత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా 27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్టు కవిసంధ్య సంపాదకుడు కళారత్న డాక్టర్ శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. యానాం గీతాభవన్‌లో ఈనెల 27న ఉదయం 9.30 గంటలకు ఈ సభ జరగనుంది. ఈసందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవి సమ్మేళన కార్యక్రమాలు జరగనున్నాయి. కవిసంధ్య సంపాదకుడు, కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, డాక్టర్ ఆర్.సీతారం తదితరులు హాజరుకానున్నారు. ఈసందర్భంగా 13 మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళిత సాహిత్యం తదితర)కి ముఖ్య అతిథులు నుంచి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళలకు రక్షణ కరువు

మండపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని వైసీపీ నేత, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్‌ఆలీఖాన్‌బాబా ఆరోపించారు. ఇంటి నుంచి మహిళలు ఆడ పిల్లలను బయటకు పంపించాలంటే భయంవేస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప జిల్లా బద్వేల్‌లో ఇంటర్ విద్యార్థిని అత్యాచారం ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన ఏజీపీ లకాని



రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 20 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులైన లకాని పద్మకమలకుమారి ఆదివారం మంత్రి సుభాష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంతి నివాసంలో మంత్రి సుభాష్‌ను కలిసి ఏజీపిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.




ఆలమూరు పల్లెపండుగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. పక్క చిత్రంలో కంద్రిగలో చేపట్టే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పథం వైపు పల్లెలు

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి వైపు పల్లెలు పయనిస్తున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలో ఆదివారం జరిగిన పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. పెనికేరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, ఆలమూరులలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి వాటిని సంక్రాంతి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో కె.జాన్‌లింకన్, ఈవోపీర్డీ ఏ.రాజు, సర్పంచ్‌లు వనుం చిన్నావతి, గుణ్ణం రాంబాబు, ఏడిద సత్యశ్రీ, సంగిత సుభాష్, తోట భవాని, నేలపూడి లావణ్య పాల్గొన్నారు.

పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ

కొత్తపేట: కూటమి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధిబాట పడుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండల పరిధి ఖండ్రిగలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధర్, కంఠంశెట్టి శ్రీనివాస్, యల్లమల్లి జగన్మోహన్, రెడ్డి రామకృష్ణ, దర్నాల రామకృష్ణ, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆర్.ఏనుగుపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

పి.గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంత రం లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, వాడ్రేవుపల్లి, మానేపల్లి, ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, వైకొత్తపల్లి, కె.ముంజవరం ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, నియోజకవర్గ పరిశీల కులు షేక్ సుభాన్, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, మట్టపర్తి రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, యాండ్ర శ్రీనివాసరావు, అన్నాబత్తుల వెంకటేశ్వ రావు, తాటికాయల శ్రీనువాసరావు, యడ్ల ఏసు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో తాతబాబు తదితరులు

సపక్‌తక్రా పోటీల్లో పతకాలు సాధించాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో పతకాలు సాధించాలని అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జవ్వాది తాతబాబు, కేతా సాయిదుర్గాప్రసాద్ కోరారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ హెచ్‌ఎం స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. జిల్లా మెన్స్ విభాగం జట్టులో కెప్టెన్‌గా పాటి సన్ని, కేతా సతీష్, సీహెచ్ మోహన కృష్ణ, జి.బాలనాగసుభాష్, కోసూరి ప్రసాద్ పాల్గొంటారు. ఉమెన్స్ జట్టు కెప్టెన్‌గా బి.జ్యోతి, డి.రాజేశ్వరి, డి.ప్రియాంక, ఐ.లక్ష్మీదుర్గ, జి.సిమ్లా పాల్గొంటారు. టీమ్ మేనేజర్‌గా సైదుల రమణ వ్యవహరిస్తారు. ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం శిక్షణ ముగిసింది. కళాశాల పాలకవర్గ సభ్యులు నడింపల్లి సుబ్బరాజు, డీఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తదితరులు అభినందించి క్రీడా కిట్లు అందజేశారు.

నాడు-నేడు పనులపై ఫిర్యాదు

ఆలమూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులపై విచారణ చేపట్టాలని విద్యా కమిటీ చైర్మన్ ఇందుగుల సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ఫిర్యాదు చేశారు. నాడు-నేడు పనుల్లో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు ఉన్నా యని దీనిపై తక్షణం విచారణ చేయాలని కోరారు. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో అసౌకర్యంగా ఉందని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు స్పందిస్తూ దీనిపై విచారణ చేపట్టాలని ఎంపీడీవో జాన్‌లింకన్‌ను ఆదేశించారు.

పల్లె పండుగతో అభివృద్ధి పరుగులు

అమలాపురం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. పేరూరు, సాకుర్రు, గున్నెపల్లి అగ్రహారం, నడిపూడి, సమనస గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ పేరిట సీసీ రోడ్లు, డ్రైయిన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయ వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు దాసరి అరుణ, గుత్తుల చిరంజీవిరావు, పెద్దిరెడ్డి రామచంద్రరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు చొల్లంగి సత్యసాయిబాబా, పొలమూరి ధర్మపాల్, ముత్తాబత్తుల రమణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చినరాజప్ప పరామర్శ


సన్నవిల్లిలో పరామర్శిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

ఉప్పలగుప్తం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి మాజీ సర్పంచ్, తన మిత్రుడు గనిశెట్టి వీరాస్వామినాయుడు ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరామర్శించారు. నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. తన సహచరునిగా టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి నాయుడు చేసిన కృషిని గుర్తు చేశారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, సర్పంచ్ చిక్కం జంగమయ్య, గొలకోటి సత్తిరాజు, యాళ్ళ బాబ్జి, గనిశెట్టి రాము, కాగిత సత్యనారాయణ, చిక్కం గాంధీ తదితరులున్నారు.

22 నుంచి గ్రామాల్లో ఆధార్ సెంటర్లు


ఎంపీడీవో జాన్‌లింకన్

ఆలమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి 25 వరకు పలు గ్రామాల్లో ఆధార్ సేవలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలమూరు ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తెలిపారు. పెదపళ్ల సచివాలయంలో జరిగే క్యాంపులో 22న పినపళ్ల, 23న చింతలూరు, 24న మోదుకూరు, 25న గుమ్మిలేరు గ్రామాల వారికి సేవ లందించనున్నట్లు చెప్పారు. ఆలమూరు-2 సచివాలయంలో 22న పెనికేరు, 23న సంధిపూడి, 24, 25లలో ఆలమూరు, జొన్నాడ-2 సచివాలయంలో జరిగే క్యాంపులో 22న మూలస్థానం-2, 23న చొప్పెల్ల 24న చెముడులంక, 25న బడుగువానిలంక గ్రామాల వారికి ఆధార్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. పదేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులు మళ్లీ తీయించుకోవాలని ఎంపీడీవో జాన్‌లింకన్ సూచించారు.


గంటి చినపేట వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

చెత్త ఇలా ఉంటే రోగాలు రావా?

● గంటిలో పడకేసిన పారిశుధ్యం ● పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహావేశాలు

కొత్తపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గంటి గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామ ముఖ్య కూడలిలో రోడ్డు పక్కనే చెత్త కుప్పలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల పడుతున్న వర్షాలకు తోడు అపరిశుభ్రత కారణంగా ఎక్కడ రోగాలు వస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ పేరుకున్న చెత్తపై పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు ఉండటంపై గ్రామస్థులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామంలో దుర్వాసన వెదజల్లుతున్నా కనీసం ముగ్గు, బ్లీచింగ్ చల్లించడం లేదని ఆరోపిస్తు న్నారు. అలాగే గంటి చినపేట శివాలయం వీధుల్లో కొద్దిపాటి వర్షానికే ముంపు నీరు వెళ్లే మార్గం లేక అపరిశుభ్రత తాండవిస్తోంది. కుక్కలు, పందులు డంపింగ్ యార్డ్ వద్ద స్వైరవిహారం చేయడంతో మరింత దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తు న్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి

మామిడికుదురు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. గెద్దాడ, మామిడికుదురు, కొమరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో నిర్మించే రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ప్రాధాన్యక్రమంలో గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మోల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు, మెండ ఆదినారాయణ, సర్పంచ్ గౌస్ మోహిద్దిన్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, నాయకులు వర్ధినీడి వెంకట్రామయ్య, సాపె ఏకదాశి, ఇంటి మహింద్ర, రుద్ర శ్రీను, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్